
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
ఆదివారం 9 ఫిబ్రవరి 2025

సంతలో.. స్పెషల్

- ఇక్కడ లోకల్ పప్పులు దొరుకును
- ఖేడ్ మార్కెట్ స్పెషల్ క్రేజ్
- పొట్టుతీయని పప్పుల విక్రయం
- పెసర్ల నుంచి గడ్డి నువ్వుల వరకూ..

7

మార్చి చివరి నాటికి పనులన్నీ పూర్తిచేయాలి

- పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ పనులను మార్చి నెల చివరి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం క్యాంప్ కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పంచాయతీరాజ్‌శాఖ చేపడుతున్న పనులపైన పంచాయతీరాజ్, డీఆర్డీవో అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖలో ఎన్ఆర్ఈజీఎస్ కింద చేపడుతున్న పనులు సీసీరోడ్లు, డ్రైనేజీ, అంగన్‌వాడీ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలో వర్షాభావ పరిస్థితుల వల్ల మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను గుర్తించి మొదటి ప్రాధాన్యతగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీసీ రోడ్డు పనులు గుర్తించి వారంలోపు ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలన్నారు. ఇది వరకు పూర్తయినా పనులకు ఎఫ్‌టీవో జనరేట్ చేసి ఆన్‌లైన్ చేయాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే డీఆర్డీవో అధికారులకు తెలిపి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ప్రాధాన్యత ప్రకారం అన్ని పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

డాక్టర్ల వల్లనే ఆరోగ్య తెలంగాణ సాధ్యం

సంగారెడ్డి ఐఎంఏ క్రికెట్ పోటీల్లో పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ల వల్లనే ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని, నిరంతరం ప్రజల ఆరోగ్యం కోసం పాటుపడే డాక్టర్లు కూడా ఆరోగ్యంగా ఉండాలంటే క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి మండలం గుడితండాలోని గగన్‌స్పోర్ట్స్ గ్రౌండ్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్ పోటీలను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, టీఎస్ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐఎంఏ వైద్యులను అతిథులు ప్రశంసించారు. ఐఎంఏ మంజీరా సంగారెడ్డి బ్రాంచ్ సెక్రటరీ, టీజీఎంసీ మెంబర్ డా.ఆనంద్ నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ స్టేట్ ప్రెసిడెంట్ కిషన్, కార్యదర్శి అశోక్, సంగారెడ్డి అధ్యక్షుడు డా.కిరణ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజి అనంతకిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్‌నాయక్, కంది మండల పార్టీ అధ్యక్షుడు మోతీలాల్, యువజన కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, కిరణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




ఐఎంఏ క్రికెట్ పోటీల్లో మాట్లాడుతున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలరెడ్డి, శివసేనారెడ్డి, ఐఎంఏ క్రీడా పోటీల్లో బ్యాట్ ఝుళిపిస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టం!

- తెచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
- ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన
- కర్ణాటక, రాజస్థాన్‌లలో చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు
- రాష్ట్రంలో ఆక్రమణలో 5వేలకు పైగా చెరువులు
- హైదరాబాద్ పరిధిలో 44 చెరువులు పూర్తిగా కనుమరుగు

7

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం

- స్కూటీని ఢీ కొట్టిన లారీ

7

ఎదురుచూపులు!

- తీరని నిర్వాసితుల సమస్యలు
- మల్లన్నసాగర్‌పై అప్పట్లో రేవంత్ ఆందోళన
- ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా సమీక్షించలే..
- పథకాలకూ దూరమవుతున్న కొందరు
- అధికారుల బదిలీలతో కొత్తగా వచ్చిన వారికి ఏం అర్థం కాక తీరొక్క సమాధానం

7



ఇతిహాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

ఇతిహాద్ ఫౌండేషన్ లోగో

అన్నార్థుల.. ఆకలి తీరుస్తూ..

సండే స్పెషల్

- మూడేళ్లుగా ఇతిహాద్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు
- నిరుపయోగ దుస్తుల సేకరణతో మొదలైన ప్రస్థానం
- ప్రభుత్వాసుపత్రి వద్ద వెయ్యిరోజులకు పైగా అన్నదానం
- పిల్లల పుట్టిన రోజు వేడుకలు, పెద్దల జ్ఞాపకార్థం ఛారిటీ సేవలు
- మానవసేవే.. మాధవసేవ అంటున్న స్వచ్ఛంద సంస్థ

మానవసేవయే మాధవ సేవ అంటారు.. దేవుడు ఎక్కడో లేదు.. మనం చేసే సాయంలోనే ఉంటాడంటారు. ఈ నమ్మకంతోనే ముందుకెళ్తుంది సిద్దిపేటలోని 'ఇతిహాద్' (ఐకమత్యం) అనే స్వచ్ఛంద సంస్థ. కుల, మతాల పట్టింపు లేకుండా సేవా కార్యక్రమాలే పరమావధిగా వినూత్న తరహా కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుంది. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల, వారి సహాయకుల ఆకలి తీరుస్తూ ముందుకు సాగుతున్నది.

- సిద్ది పేట కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి)

సిద్దిపేటకు చెందిన సయ్యద్ షఫిక్ అహ్మద్ ముంతాజ్ బేగంకు ఏడుగురు సంతానం. అందులో సయ్యద్ లాయక్ అహ్మద్, అతిక్ అహ్మద్, రఫిక్, ఇసాక్ అహ్మద్, రెహేనా బేగం, ఫర్హానా బేగం, డా.తబస్సుం. సయ్యద్ షఫిక్ అహ్మద్.. వీరంతా అహ్మద్ రేడియోగా పట్టణవాసులకు సుపరిచితమే. తల్లిదండ్రుల సేవా గుణం వారి సంతానానికి అలవడింది. కుటుంబంలోని అతిక్ అహ్మద్ ఆలోచన రూపమే ఇతిహాద్ ఫౌండేషన్. 2021లో ఆరుగురు సభ్యులతో ఫౌండేషన్‌కు రూపకల్పన చేశారు. చైర్మన్‌గా అతిక్ అహ్మద్, వైస్ చైర్మన్‌గా ఎండీ అఖిల్, జనరల్ సెక్రటరీగా గ్యాదరి మధుతో పాటు మరికొంతమందితో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటైంది. అన్ని కుల, మతాలు ఒకటే, ఐక్య భావం, దేశభక్తి స్ఫూరించేలా లోగో డిజైన్ చేసి ఇతిహాద్ (ఐకమత్యం) అనే పేరుతో ఫౌండేషన్ ప్రారంభించి ముందడుగు వేశారు. అయినకాడికి తోచినంత సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు. కరోనా సమయంలో ప్రజల ఇబ్బందులను చూసి ఇతిహాద్ ఫౌండేషన్ సభ్యులకు ఒక ఆలోచన వచ్చింది.


ఇతిహాద్ ఏర్పాటు చేసిన అన్నదానం వద్ద భోజనం చేస్తున్న ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగుల కుటుంబసభ్యులు

మిగతా 7లో..

బడ్జెట్‌లో విద్యకు 20 శాతం

నిధులు కేటాయించాలి

- విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరసన

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యా పరిరక్షణ కమిటీ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యా పరిరక్షణ కమిటీ నాయకులు తిరుపతి రెడ్డి, కిష్టయ్య, విజేందర్‌రెడ్డి, నరేందర్ మాట్లాడారు. రాష్ట్రంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తానని చెప్పి గద్దెకెక్కిన గత ప్రభుత్వం విద్యారంగానికి నిధులు గణనీయంగా తగ్గించడం వల్ల ప్రభుత్వ విద్య నిర్వీర్యం అయిపోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా రాష్ట్రంలో విద్యకు తగిన ప్రాధాన్యం ఇస్తామనే వాగ్దానంతో గెలిచిందన్నారు. 2024-25 బడ్జెట్‌లో విద్యకు కేటాయించింది కేవలం 7.3శాతం మాత్రమేనని గుర్తుచేశారు. ఇది దేశంలోని ఇతర రాష్ట్రాల్లో విద్యకు కేటాయించిన బడ్జెట్ సగటు 14.7 శాతంలో సగం కన్నా తక్కువేనన్నారు. బడ్జెట్ కేటాయింపులు తక్కువగా ఉండడం వల్ల పాఠశాల విద్యా నాణ్యతలో పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ప్రకారం.. 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఉంటే తెలంగాణ రాష్ట్రం 35వ స్థానానికి దిగజారిందన్నారు. ఇప్పటికైనా విద్య ప్రాధాన్యతను గుర్తించి, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, అలా కేటాయించిన నిధులు ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి మాత్రమే ఖర్చుపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య, నర్సిములు, మల్లేశం రాజయ్య సత్యనారాయణ, రాములు, రాంచంద్రం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న విద్యాపరిరక్షణ కమిటీ నాయకులు


గజ్వేల్‌లో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ఢిల్లీలో విజయం.. జిల్లాలో సంబురం


- టపాసులు కాల్చి.. మిఠాయిలు పంచిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు

8

గుర్తులొచ్చాయ్

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌కు 30.. వార్డు సభ్యులకు 20 గుర్తులు

- పల్లెపోరుకు సిద్ధమవుతున్న అధికార యంత్రాంగం
- ఎన్నికలెప్పుడొచ్చినా నిర్వహణకు ముందస్తుగా సన్నద్ధం
- బ్యాలెట్ బాక్సులు, పత్రాలను సమకూర్చే పనిలో నిమగ్నం
- పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది ఎంపికపైనా దృష్టి



సంగారెడ్డి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ దిశగా అధికార యంత్రాంగం సమాయత్తమవుతున్నది. నోటిఫికేషన్ ఎప్పుడొచ్చినా ఎన్నికల ప్రక్రియను సజావుగా చేపట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల గుర్తులు మొదలు పోలింగ్ సిబ్బంది నియామకం దాకా కసరత్తు చేస్తున్నారు. జిల్లాల్లో కొద్దిరోజులుగా అధికారులు ఇదే పనిపై దృష్టిపెట్టారు. వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులకు విధులను కేటాయించారు. పంచాయతీల సంఖ్యకు అనుగుణంగా, వార్డుల వారీగా కావాల్సిన బ్యాలెట్ పత్రాల అవసరాన్ని అంచనా వేస్తున్నారు. ఎక్కువగా అవసరం కావడంతో పక్క రాష్ట్రాల నుంచి తేవడానికి సిద్ధమయ్యారు. పోలింగ్ కేంద్రాల ఎంపిక ఇప్పటికే పూర్తయ్యింది. ఎన్నికల్లో విధులు నిర్వహించడానికి ఉపాధ్యాయులతోపాటు ఇతర శాఖల ఉద్యోగులను గుర్తించారు.

S.No.	Symbols in English and Telugu	Specimen symbol
1	Ring ఉంగరము	
2	Scissors కత్తెర	
3	Bat బ్యాట్	
4	Football ఫుట్ బాల్	
5	Lady Purse లేడీ పర్సు	
6	T.V. Remote టి.వి. రిమోట్	
7	Tooth Paste టూత్ పేస్టు	
8	Spanner స్పానర్	


సర్పంచ్ అభ్యర్థుల గుర్తులు

రిజర్వేషన్లపై ఉత్కంఠ

పల్లెల్లో ప్రస్తుతం ఎన్నికల రిజర్వేషన్లే హాట్‌టాపిక్‌గా మారాయి. సామాజిక వర్గాల వారీగా ఇప్పటికే ఆశావహులు పోటీకి సిద్ధమయ్యారు. పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలించకుంటే స్థానిక ఎన్నికల వైపు గురిపెడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో సగం దాకా మహిళా రిజర్వేషన్లు ఉండడంపైనా తర్జనభర్జన పడుతున్నారు. అయితే, రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం ఆయా గ్రామాల్లో సామాజిక వర్గాల జనాభా శాతం, మహిళల సంఖ్యతోపాటు గతంలో వరుసగా మూడుసార్లు వచ్చిన రిజర్వేషన్లను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లుగా తెలుస్తోంది. క్రితంసారి వచ్చిన రిజర్వేషన్ ఈసారి దాదాపుగా ఉండకపోవచ్చని అంటున్నారు. తమ గ్రామానికి ఫలానా రిజర్వేషన్‌ను కేటాయించాలని అధికారులకు వినతిపత్రాలు సైతం అందజేస్తున్నారు. మొత్తంగా ఎన్నికల కోడ్ వెలువడకముందే రిజర్వేషన్ల చర్చ పల్లెపల్లెనా రాజకీయవేడిని పుట్టిస్తోంది.

పంచాయతీ గుర్తులివే..

గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి గుర్తులపై తుది కసరత్తు పూర్తయ్యింది. సర్పంచ్ అభ్యర్థులకు 30 గుర్తులు, వార్డుసభ్యులకు 20 గుర్తులను ఆమోదించినట్లుగా తెలుస్తోంది. దాదాపు ఇవే గుర్తులు ఫైనలయ్యే అవకాశం ఉంది.

సర్పంచ్ గుర్తులు

ఉంగరం, కత్తెర, బ్యాటు, ఫుట్‌బాల్, లేడీ పర్సు టి.వి రిమోట్, టూత్ పేస్టు, స్పానర్(పానా), చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, బెండకాయలు, కొబ్బరితోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, చేతికర్ర, మంచం, పలక, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, క్రికెట్ బ్యాట్స్‌మెన్, పడవ, బిస్కట్, పిల్లనగోవి, చైను, చెప్పులు, బెలూన్, క్రికెట్ వికెట్లు.

వార్డు సభ్యుల గుర్తులు

గౌను, గ్యాస్‌స్టవ్, స్టూల్, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండ, డిష్ యాంటీనా, గరాటా, మూకుడు, ఐస్‌క్రీం, గాజుగ్లాసు, పోస్టు డబ్బా, ఎన్వలప్ కవరు, హాకీ కర్ర మరియు బంతి, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టె, విద్యుత్ పోల్, కెటిల్.

'సేవాలాల్ మహరాజ్ జయంతి రోజు సెలవుగా ప్రకటించాలి'

పుల్‌కల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్ మహరాజ్ జయంతి రోజున దేశవ్యాప్తంగా సెలవుదినంగా ప్రకటించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం చౌటకూర్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ బంజారా గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఫిబ్రవరి 15న ఉన్నందున దేశవ్యాప్తంగా సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సెలవు దినంగా ప్రకటించాలని జైపాల్ నాయక్ కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో 4.3 కిలోల శిశువు జననం



శిశువుతో తల్లి ముంతాజ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం ఓ మహిళ 4.3 కిలోల బరువు గల శిశువుకు జన్మనిచ్చింది. పట్టణంలోని కస్తూరిబా కాలనీకి చెందిన ముంతాజ్ అనే మహిళలకు నాలుగవ కాన్పుగా ఈ శిశువును వైద్యులు శస్త్రచికిత్స ద్వారా డెలివరీ చేసినట్లు ఆసుపత్రి సూపరిండెండెంట్ రమేశ్‌రెడ్డి తెలిపారు. సాధారణంగా 2.5 లేదా 3 కిలోల బరువు ఉంటారని, 4.3 కిలోల బరువు అనేది అరుదుగా జన్మిస్తారని ఆయన తెలిపారు. శిశువు కూడా ఆరోగ్యంగా ఉన్నారని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు దుర్మరణం

» స్కూటీని ఢీ కొట్టిన లారీ


వేణు (ఫైల్)


శివ(ఫైల్)

దౌల్తాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అత్తగారింట్లో ఒడిబియ్యం పోసుకునేందుకు ఇద్దరు కుమారులతో కలిసి వెళ్తుండగా, వెనుకగా వచ్చిన లారీ.. వారు ప్రయాణిస్తున్న స్కూటీని ఢీ కొట్టడంతో తండ్రితో పాటు ఓ కుమారుడు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరోకుమారుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి శివారులో శనివారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల వేణు(41) తన ఇద్దరు కొడుకులు చిట్యాల శివ(15), విష్ణులను స్కూటీపై ఎక్కించుకుని తిరుమలాపూర్ నుంచి మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం దరిపల్లి ఒడిబియ్యం పోసుకోవడానికి అత్తగారింటికి వెళ్తున్నాడు. వారు ప్రయాణిస్తున్న స్కూటీ చెట్ల నర్సంపల్లి బైపాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే గజ్వేల్ వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ (ఆర్‌జే 11జీసీ 4685-రాజస్థాన్) ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వేణు, అతని పెద్ద కుమారుడు శివ తీవ్రగాయాలతో అక్కడికక్కడే చనిపోయారు. చిన్న కుమారుడు వేణు స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. ఇద్దరి మృతదేహాలు ప్రమాదస్థలంలో గుర్తుపట్టకుండా చెల్లాచెదురయ్యాయి. స్థానికులు కుటుంబ సభ్యులకు, దౌల్తాబాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ సిబ్బందితో వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. లారీ డ్రైవర్ లారీ అక్కడే వదిలి పరారయ్యాడు. వేణు టైలరింగ్ పని చేస్తుండగా, ప్రమాదం మృతి చెందిన శివ జెడ్పీ స్కూల్‌లో పదో తరగతి, గాయపడిన విష్ణు ఎనిమిదో తరగతి చదువుతున్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రీకుమారులు మృతి చెందడంతో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తూట్ మినీ ఫైనాన్స్ మేనేజర్‌పై కేసు

● సొంత సంస్థను మోసం చేసినందుకు..

నర్సాపూర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ ముత్తూట్ మినీ ఫైనాన్స్ బ్రాంచ్‌లో మేనేజర్‌పై సొంత సంస్థనే మోసం చేశారు. నకిలీ బంగారంతో పాటు తూకంలో మోసానికి పాల్పడినందుకు అయనతో సహా అయనకు సహకరించిన మరో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ లింగం కథనం ప్రకారం.. నర్సాపూర్‌లోని ముత్తూట్ మినీ ఫైనాన్స్ బ్రాంచ్‌లో శివ్వంపేట మండలం పెద్దగొట్టిముక్లకు చెందిన గుండా రాజు మేనేజర్‌గా పని చేసేవాడు. తనకు పరిచయం ఉన్న సురేష్, ఆకాశ్, ప్రవీణ్‌లతో కలిసి నకిలీ బంగారంతో పాటు తూకంలో మోసానికి పాల్పడి రూ. ఏడు లక్షల పది వేల 356 రుణంగా తీసుకున్నాడు. విషయం తెలుసుకుని రీజినల్ మేనేజర్ రాజు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మేనేజర్ గుండా రాజుతో పాటు అతనికి సహకరించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సంతలో.. స్పెషల్

ఇక్కడ లోకల్ పప్పులు దొరుకును

● ఖేడ్ మార్కెట్ భలే క్రేజ్
● పొట్టుతీయని పప్పుల విక్రయం
● పెసర్ల నుంచి గడ్డి నువ్వుల వరకూ..

నారాయణఖేడ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పెసర్లు, మినుములు, కందులు, శిరిశనగలు, శనగలు, తయిదలు, శ్యామలు, గడ్డి నువ్వులు, అరికెలు, గోధుమలు, జొన్నలు.. పోషకాలు అధికంగా ఉండే వీటిని ఆహారంలో భాగం చేసుకునేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. పొట్టుతో ఉండే వీటిని వంటకు సిద్ధం చేయడం ప్రస్తుత బిజీ లైఫ్‌లో కష్టమైన పనే. కానీ, జహీరాబాద్‌లో విక్రయించే లోకల్ పప్పులను జనం ఇష్టంగా కొంటున్నారు. కొంచెం కష్టమైన పొట్టుతో లభించే ఈ పప్పులను సంప్రదాయ పద్ధతిలో శుభ్రం చేసుకుని ఆరోగ్యాన్ని రక్షించుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

నారాయణఖేడ్‌లో ప్రతీ మంగళవారం జరిగే సంతలో లోకల్ పప్పులు కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతుంటారు. కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో ఉన్న ఈ ప్రాంత ప్రజలు పొట్టుతీయని పప్పుల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయని వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా వ్యాపారులు స్థానికంగా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి పొట్టుతీయని పెసర్లు, మినుములు, కందులు, శిరిశనగలు, శనగలుతో పాటు తయిదలు, శ్యామలు, గడ్డి నువ్వులు, అరికెలు, గోధుమలు, జొన్నలు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. మంగళవారం సంతకు వచ్చిన వారంతా వారానికి సరిపడా.. ఇంకా కొంత మంది నెలకు సరిపడా పప్పులను కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఇంకా ఎక్కువగానే కొనుగోలు చేస్తారని వ్యాపారులు చెబుతున్నారు.


నారాయణఖేడ్‌లో అమ్మడానికి సిద్ధంగా లోకల్‌పప్పులు

ధర ఎక్కువైనా..

మార్కెట్‌లో ప్రాసెస్ చేసి, వంట చేసుకునేందుకు రెడీగా ఉన్న పప్పుల కంటే ఈ లోకల్, పొట్టు తీయని పప్పులకు ధర కాస్త ఎక్కువే ఉంటుంది. ప్రస్తుతం రైతులు వాణిజ్య పంటల సాగుకే అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో పప్పు దినుసుల సాగు తగ్గింది. అయినా, నారాయణఖేడ్ సంతకు వచ్చే వ్యాపారులు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచీ పప్పులను తీసుకువచ్చి సంతలో విక్రయిస్తారు. ఎక్కడా దొరకని పప్పులు ఇక్కడ దొరుకుతుండటంతో పప్పుల కోసమే నారాయణఖేడ్ మంగళవారం సంతకు వస్తారంటే అతిశయోక్తి కాదు. సీజన్ బట్టి కాకుండా ఏడాదంతా ఇక్కడ అన్ని రకాల పప్పులు దొరుకుతాయి. ఖేడ్ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం ఇక్కడికి వచ్చినప్పుడు తమ అవసరాలకు అనుగుణంగా పప్పులు కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు.


ఖేడ్‌లో లోకల్ పప్పులను తూకంచేస్తున్న వ్యాపారి

20 ఏళ్లుగా అమ్ముతున్నా..



మాది నారాయణఖేడ్ మండలంలోని జి. హుక్కా గ్రామం. సంతలో 20 ఏళ్లుగా లోకల్ పప్పులను అమ్ముతున్నా.. నా దగ్గర అన్ని రకాల పొట్టుతీయని పప్పులు దొరుకుతాయి. అవసరం ఉన్న వారు ముందుగానే ఆర్డర్ ఇస్తారు. మంగళవారం సంతలో లోకల్, పొట్టు తీయని పప్పులకు గిరాకీ బాగానే ఉంటుంది. పప్పు దినుసులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి అమ్ముతున్నా..

-మల్‌రెడ్డి, పప్పుల వ్యాపారి

గిరాకీ బాగుంటుంది..



మాది మనూరు మండలం డొవ్వరు. నేనూ 20 ఏళ్లుగా లోకల్, పొట్టు తీయని పప్పులను సంతలో అమ్ముతున్నా.. మార్కెట్‌లో శుభ్రం చేసిన పప్పులు ఉన్నా.. పొట్టు తీయని పప్పులు కొనుగోలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో దొరికే పప్పులను తీసుకువచ్చి సంతలో అమ్ముతున్నా.. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల వారూ నా దగ్గర పప్పులు కొంటారు.

- శణ్ముకయ్య స్వామి, పప్పుల వ్యాపారి

చుక్కల్లో జొన్న.. కిలో రూ. 70

పచ్చజొన్నకూ గిరాకీ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జొన్నరొట్టెలు తినడం వల్ల ఆరోగ్యం బాగుంటుందని, మధుమేహంతో బాధపడేవారు జొన్నరొట్టెలు తింటే చక్కెర అదుపులో ఉంటుందని ఎక్కువ మంది జొన్న రొట్టెలు తినడానికి ఆసక్తి చూపుతున్నారు. దీంతో జొన్నలకు మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. గతంలో పశుగ్రాసం కోసం సాగు చేసే పచ్చ జొన్న కూడా ఇప్పుడు తెల్లజొన్నతో సమానంగా రేటు పలుకుతోంది. సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా పడిపోతోండటంతో ధరలు చుక్కలనంటుతున్నాయి.



సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 58,744 ఎకరాల్లో జొన్న సాగు చేసేవారు. నారాయణఖేడ్ ప్రాంతంలో 50 శాతం వరకు జొన్నసాగు ఉండేది. ఇదంతా గతం ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా కేవలం 28,610 ఎకరాల్లో మాత్రమే జొన్నసాగు అయింది. అంటే సాగు 50 శాతానికి పడిపోయింది. సాధారణ విస్తీర్ణం కంటే 30.134 ఎకరాల్లో జొన్న సాగు తగ్గింది. గతంలో నాణ్యమైన తెల్లజొన్నలు కిలో రూ.10కి మించి విక్రయించే వారు కాదు. పచ్చ జొన్న పంటను పశుగ్రాసం కోసం సాగు చేసేవారు. పచ్చ జొన్నలను ఉచితంగా ఇస్తే కూడా తీసుకునే పరిస్థితి ఉండేది కాదు. ప్రస్తుతం పచ్చజొన్నలు నాణ్యతను బట్టి కిలో రూ.70 వరకు విక్రయిస్తున్నారు. తెల్ల జొన్నలు నాణ్యమైనవి కిలో రూ.70 వరకు విక్రయిస్తుండగా, నీటి ఆధారంగా సాగు చేసిన తెల్ల జొన్నలు కిలో రూ.50 చొప్పున విక్రయిస్తున్నారు.



అన్నార్థుల ఆకలి తీరుస్తూ..


వెయ్యి రోజుల సందర్భంగా అన్నదానం కార్యక్రమంలో హరీశ్‌రావు

5వ పేజీ తరువాయి..

చాలా మంది ఇళ్లలో వాడకుండా నిరుపయోగంగా దుస్తులు ఉంటాయి. వాటిని అవసరమైన వారికి అందిస్తే బాగుంటుందనుకున్నారు. ఆ ఆలోచనకు కార్యరూపం తీసుకువచ్చారు. నిరుపయోగంగా ఉన్న దుస్తులు, దుప్పట్లను సేకరించి నిరుపేదలకు అందజేసేవారు. నిరుపయోగంగా ఉన్న దుస్తులు, వస్తువులు ఉంటే తమకు సమాచారం ఇస్తే.. వెళ్లి ఆ వస్తువులను తీసుకొచ్చి అవసరం ఉన్న వారికి అందజేసేవారు. ఈ క్రమంలోనే అన్నదానం చేపట్టాలనే ఆలోచన వచ్చింది. 2022లో ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుటుంబసభ్యుల సహకారంతో అతిక్ అహ్మద్ ఈ కార్యక్రమం మొదలుపెట్టారు. ప్రభుత్వాసుపత్రి వద్ద అయితే చాలామంది గ్రామాల నుంచి, పేద మధ్య తరగతి వాళ్లు వస్తుంటారు. రోగుల సహాయకులు రోజూ హోటళ్లలో భోజనం చేయాలంటే బాగానే ఖర్చవుతుంది. ఆసుపత్రి ప్రాంతంలో అన్నదానం ఏర్పాటు చేసినట్లయితే అవసరమైన వారికి సాయం అందుతుందని భావించారు. సంకల్పం గొప్పగా ఉంటే సహకారం అదే వస్తుందన్నట్టుగా వీరిని కొంతమంది తోడయ్యారు. అప్పటి నుంచి వందల సంఖ్యలో పుట్టినరోజు వేడుకలు, పెద్దల జ్ఞాపకార్థం పేరిట నిర్విరామంగా ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం చేపడుతున్నారు. యాధృచ్ఛికంగా అన్నం తిన్నవాళ్లు కూడా తమ బంధువుల పేరిట అన్నదానానికి సహకరించిన సందర్భాలున్నాయి. కొంతమంది అన్నప్రాసన పూర్తిచేసుకుని అన్నదానంలో పాలుపంచుకున్న వాళ్లూ ఉన్నారు. మరికొంత మంది తమ పిల్లల పుట్టినరోజును కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకుంటారు.

సాయాన్ని బట్టి అన్నదానం మెనూ

రోజూ 200 మందికి సరిపడా రెండు రకాల కూరలు, చారు, పెరుగు, అప్పడాలు అన్నదానంలో ఏర్పాటు చేస్తారు. వెజ్ బిర్యానీ, దాల్చ, పప్పుచారు, కిచిడీ, పాపడ్ వంటి స్పెషల్ ఐటమ్స్ చేయాల్సి వస్తే 3 వేల నుంచి రూ.3,500 వరకు సాయం చేయాల్సి ఉంటుంది. ఈ మెనూతో పాటుగా కోడిగుడ్లు, బగారా రైస్ కావాలంటే రూ. 5 వేల వరకు ఖర్చు అవుతుంది. నాన్ వెజ్ ఐటమ్స్‌తో చికెన్ కర్రీ, బగారా, చికెన్ బిర్యానీతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయాలనుకుంటే రూ.7 వేల నుంచి రూ.7,500 వరకు దాతలు సహకరించాల్సి ఉంటుంది. ముందుగా సమాచారమిచ్చి డబ్బులిస్తే దాతలు ఎవరి పేరు మీద అన్నదానం చేయాలనుకుంటున్నారో వారి పేరు మీద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ఉదయం 9 నుంచి అన్నదానం ఏర్పాటు చేస్తారు. ఒకవేళ ఎవరు దాతలు లేకపోతే ఇతిహద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేపడతారు. ఈ సేవా కార్యక్రమం ప్రారంభించి ఇప్పటికే వెయ్యి రోజులు దాటింది. వెయ్యిరోజులు పూర్తయిన సందర్భంగా మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ హాజరై అన్నదానంలో పాల్గొన్నారు.

ఐక్యత పెరగాలి..



ఇతిహద్ అంటే ఐకమత్యం. సమాజంలో పెరుగుతున్న ద్వేష భావం పోయి ఐకమత్యంగా ఉండాలనేది నా అభిప్రాయం. దేవుడు మనకు ఇచ్చిన దాంట్లో మనకు చేతనైనంత తోటి వారికి సహాయ పడాలనేది మా తల్లిదండ్రులు నేర్పించారు. నేను సంపాదించిన దాంట్లో దాదాపు 70 శాతం చారిటీకి కేటాయిస్తాను. కుటుంబ సభ్యులు కూడా ఫౌండేషన్‌కు ఆర్థికంగా ప్రోత్సాహం అందిస్తారు. నిరుపేదలకు నిత్యావసరాలు కూడా మా స్వచ్ఛంద సంస్థ నుంచి అందిస్తాం.

- అతిక్ అహ్మద్, ఇతిహద్ ఫౌండేషన్ చైర్మన్

మనుమరాలి ఆరోగ్యం బాగలేక ఆసుపత్రికి వచ్చాం



నా మనవరాలి ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించాం. మూడు రోజుల పాటు నాతో పాటు మా కుటుంబ సభ్యులూ ఇక్కడే తిన్నారు. చాలా బాగుంది.

- పూలమ్మ, పందిల్ల హుస్నాబాద్

మా పిల్లల పేరుమీద భోజనం పెట్టిస్తాం



మా కోడలు కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చాం. దేవుడి దయవల్ల ఇద్దరు పాపలు ఆరోగ్యంగా పుట్టారు. మూడు రోజుల పాటు ఇక్కడే భోజనం చేశాం. వచ్చే సంవత్సరం మా పిల్లల పుట్టినరోజు నాడు అన్నదానం పెట్టిద్దామనుకుంటున్నాం.

- కళావతి, దుబ్బాక

కూతురు కాన్పుకోసం వచ్చాను



నా కూతురు కాన్పు కోసం ఆసుపత్రికి వచ్చాం. రెండు రోజులు అన్నదానం దగ్గరే తిన్నా.. చాలా బాగుంది. బయట కుటుంబం అంతా తింటే చాలా ఖర్చు అవుతుంది. కనీసం ఒక పూటైన డబ్బులు ఆదా అవుతాయి కదా.

- యాదమ్మ, బంజారపల్లి హుస్నాబాద్

చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టం!

● తెచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం
● ఇప్పటికే అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జలవనరుల సంరక్షణపై ప్రభుత్వం దృష్టిసారించింది. చెరువుల ఆక్రమణల విషయంలో చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక చట్టాలులేకపోవడం, వాల్టా వంటి చట్టాలున్నా ప్రభావవంతంగా పని చేయకపోవడంతో జలవనరుల సంరక్షణ సవాలుగా మారుతోంది. చెరువు భూములను ఆక్రమిస్తే ఇప్పటికీ 1905నాటి భూ ఆక్రమిత చట్టం కిందే చర్యలు తీసుకునే పరిస్థితి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో చెరువుల సంరక్షణకు సమగ్రమైన ప్రత్యేక చట్టం తీసుకురావాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. చెరువుల సంరక్షణకు బలమైన చట్టాన్ని తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కర్ణాటక, రాజస్థాన్‌లో చెరువుల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయి. మనదగ్గర లేకపోవడంతో వేలాది ఎకరాల చెరువుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. హైదరాబాద్ పరిధిలో 127 చెరువులు పాక్షికంగా, 44 చెరువులు పూర్తిగా కనుమరుగయ్యాయి. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో చెరువుల్లోనే నివాస, వాణిజ్య భవనాలు నిర్మించిన దాఖలాలు ఉన్నాయి.

తెలంగాణలో 63,063 జలవనరులు (కుంటలు, చెరువులు, జలాశయాలు, చెక్ డ్యామ్‌లు వంటివి) ఉన్నట్టు కేంద్ర జలశక్తి శాఖ తాజా సర్వేలో వెల్లడైంది. చెరువుల సంరక్షణకు వాటర్ ల్యాండ్ అండ్ ట్రీస్ యాక్ట్ (వాల్టా) ఉంది. దీంతోపాటు తెలంగాణ మునిసిపల్ చట్టం కూడా చెరువుల సంరక్షణకు సంబంధించిన నిబంధనలు కలిగి ఉంది. అయితే ఈ చట్టాలు బలంగా లేకపోవడంతో ఆక్రమణలను అడ్డుకునే పరిస్తితి లేకుండాపోతోంది. హైదరాబాద్‌లోని కీలకమైన ప్రాంతాల్లో చెరువుల సంరక్షణ ప్రభుత్వానికి సవాలుగా మారింది. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో 920 చెరువులు ఉంటే 2014 వరకు 225 చెరువులు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. 2014 నుంచి 2023వరకు మరో 44 చెరువులు పూర్తిగా కనుమరుగు కాగా 127 చెరువులను పాక్షికంగా ఆక్రమించారు. 2014 నుంచి 2023 వరకు 171 చెరువులు ఆక్రమించినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే చెరువుల ఆక్రమణలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు హైడ్రా అనే సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. చెరువుల పరిరక్షణకు గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణల తొలగింపు, జలవనరుల పెంపునకు చర్యలు చేపట్టారు. ఇక ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 5వేలకుపైగా చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. పట్టణీకరణలో వేగం ఇందుకు ప్రధాన కారణంగా గుర్తించారు. హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నివేదికల ప్రకారం హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో 2014 నాటికి 3,245 ఎకరాల చెరువుల భూములు ఆక్రమణలకు గురికాగా 2023నాటికి 4,000 ఎకరాలకు చేరాయి. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాలకు పైగా చెరువుల భూములు ఆక్రమణకు గురైనట్టు మిషన్ కాకతీయ పథకంలో చేపట్టిన సర్వేలో వెలుగుచూసినట్లు తెలుస్తోంది. మిషన్ కాకతీయతో గత ప్రభుత్వ హయాంలో 5వేల ఎకరాలను ఆక్రమణల చెర నుంచి విడిపించగా ఇంకా 15 వేల ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోనే ఉన్నాయి. చెరువుల సంరక్షణలో అనుకున్న ఫలితాలను పొందాలంటే బ్రిటిష్ కాలంనాటి భూ ఆక్రమిత చట్టంతో ఉపయోగంలేదని.. కర్ణాటక, రాజస్థాన్ తరహాలో బలమైన ప్రత్యేక చట్టాన్ని తేవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇక 2016లో ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కూడా రద్దవడంతో జలవనరుల సంరక్షణకు పటిష్ట చట్టం తీసుకురావడంతోపాటు చెరువుల పర్యవేక్షణకు ఒక అథారిటీని ఏర్పాటు చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించింది.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశపరీక్ష

వర్గల్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ నవోదయ విద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి గాను 9వ తరగతి, 11వ తరగతిలో ఖాళీ ఏర్పడిన సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం గజ్వేల్, ప్రజ్ఞాపూర్, వర్గల్ కేంద్రాలలో ప్రశాంతంగా జరిగినట్లు వర్గల్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 11వ తరగతి ప్రవేశానికి గాను 1,621 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1,114 మంది హాజరయ్యారని, 507 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు గాను 989 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 563 మంది హాజరయ్యారని, 426 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 68.72 శాతం, 9వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 56.93 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్, వర్గల్ నవోదయలో ఏర్పాటు చేసిన ప్రవేశ పరీక్ష కేంద్రాలకు నాయబ్ తహసీల్దార్లు భార్గవ్‌రామ్ నాయక్, భాస్కర్‌లు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా వ్యవహరించారని, వీరితో పాటు గజ్వేల్ మండల విద్యాధికారి సునీత ఆయా కేంద్రాలను సందర్శించినట్లు తెలిపారు.

ఎదురుచూపులు..!

తీరని భూనిర్వాసితుల సమస్యలు

● మల్లన్నసాగర్‌పై అప్పట్లో రేవంత్ ఆందోళన
● ప్రభుత్వం ఏర్పాటై ఏడాదైనా సమీక్షించలే..
● పథకాలకూ దూరమవుతున్న కొందరు

గజ్వేల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. తమ సమస్యలపై పోరాడిన నాయకుడే సీఎం కావడంతో సమస్యలు పరిష్కారం అవుతాయని భావించినా.. ఈ విషయంపై కనీస సమీక్ష కూడా చేయకపోవడంతో నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ బాధలు తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి తమ సమస్యలను తీర్చాలని కోరుతున్నారు.

ఏడాదిగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీకి చెందిన 60 ఏళ్ల పైబడిన వారికి, 18ఏళ్ల పైబడిన వారికి, ఇతర లబ్ధిదారులకు దాదాపుగా ఏడాది క్రితం 600 ఫ్లాట్లు రిజిస్ట్రేషన్ చేసినప్పటికీ వాటికి సంబంధించిన హద్దులు చూపించకపోవడం, డాక్యుమెంట్లు లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. హద్దులు చూపకపోవడంతో మిగిలిన వారికీ ఏడాదిగా రిజిస్ట్రేషన్లు కూడా నిలిపివేశారు. ముందుగా 60 ఏళ్ల పైబడిన, 18 ఏళ్ల వయస్సు వారి విషయంలో నిర్ణయం తీసుకున్న తర్వాతే మిగిలిన వారికి రిజిస్ట్రేషన్లు చేయాలని డిమాండ్ చేయడంతో రిజిస్ట్రేషన్లు నిలిచినట్లు తెలుస్తోంది. ఇటీవల వేములఘాట్‌కు చెందిన సీర్ల గంగవ్వతో పాటు 36మంది భూనిర్వాసితులు, ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన జయాల నర్సయ్యతోపాటు 56మంది భూనిర్వాసితులు తమను కుటుంబంగా పరిగణించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించగా, కోర్టు సైతం ఒంటరి వాళ్లను కుటుంబంగా పరిగణించాలని, వారి విషయంలో నాలుగు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ తీర్పును ఇచ్చింది. దీనిపై ప్రభుత్వం నుంచి ఇంకా ఎటువంటి నిర్ణయం వెలువడలేదు. ఇక రిజిస్ట్రేషన్ల కోసం, ప్యాకేజీ, పరిహారం కోసం ఎదురు చూసి చూసి పలువురు గుండెలు ఆగి, మానసిక వేదనకు గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

ప్రభుత్వ పథకాలకూ దూరం

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీలో మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ ఏర్పాటు కావడం... వారికి భూమి లేకపోవడంతో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి భూనిర్వాసితులు దూరమయ్యారు. వాస్తవానికి భూనిర్వాసితులలో 20శాతం మంది మాత్రమే అక్కడక్కడా భూములు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తుండగా, మిగతా వారు ఏలాంటి పని లేకపోవడంతో వ్యవసాయ కూలీ పనులను గజ్వేల్ నుంచి సిద్దిపేట, తూప్రాన్, తుర్కపల్లి, కొమురవెల్లి వరకు వెళ్తున్నారు. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల వారైనప్పటికి మునిసిపాలిటీలో విలీనం కావడంతో ఉపాధి హామీ పనిలేకపోవడంతో ఇందిరమ్మ భరోసా పథకానికి దూరమయ్యారు. గతంలో భూమి ఉంటే ప్రభుత్వం అందించే రైతుభరోసా అందుతుండేది. ప్రస్తుతం భూమి లేని వారిగా మారడంతో రైతుభరోసాకు దూరమయ్యారు. మునిసిపాలిటీలో గ్రామాలు ఉండడంతో ఉపాధి హామీ పనులకూ వెళ్లలేని పరిస్థితి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని భూనిర్వాసితులు కోరుతున్నారు.


మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామం

ప్యాకేజీ, పరిహారం కోసం

మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో భూములు, ఇళ్లను కోల్పోయిన అనేక మందికి ఇంకా ప్యాకేజీ, పరిహారం అందక ఎదురుచూపులు తప్పడం లేదు. దాదాపు నాలుగేళ్ల క్రితం గజ్వేల్‌కు కట్టుబట్టలతో వచ్చిన భూనిర్వాసితులకు రావాల్సిన అనేక పరిహారాలు, ఫ్లాట్లు ఇప్పటికి ఫైనల్ కాకపోవడంతో కాగితాలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇక ఒంటరి మహిళలు, 18ఏళ్ల పైబడిన యువతీ, యువకులకు సంబంధించిన పరిహారాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటన్నింటిపై అధికారులు పలుమార్లు సమీక్షలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు ప్రభుత్వం నుంచి రాకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నారు. మరోపక్క మరో 600మందికి ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు, ప్యాకేజీ, పరిహారం ఇవ్వాల్సి ఉంటుదని అధికారులు చెబుతున్నారు. మరో విషయం ఏమిటంటే అధికారులు సైతం బదిలీ కావడంతో వారి స్థానాల్లో వచ్చిన కొత్త వారికి ఏలాంటి అవగాహన లేకపోవడంతో తలోరకమైన జవాబు చెబుతున్నారు.

10న బుగ్గ రాజేశ్వరస్వామి దేవస్థానం దుకాణాల వేలం

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 10 బుగ్గ రాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలో ఆయా దుకాణాలకు వేలం పాట నిర్వహించ నున్నట్టు దేవస్థానం చైర్మన్ బాగన్న కురు ణాకర్ ముదిరాజ్ శనివారం తెలిపారు. మహ శివరాత్రికి ఆరు రోజులకు కొబ్బరి కాయల అమ్మకం, సైకిల్, మోటార్ సైకిల్ పార్కింగ్, నూనె గురుగుల అమ్మకం, లడ్డూ, పులిహోర అమ్మకాలు, జాతర అనంతరం సంవత్సరం పాటు దుకాణాలకు వేలం పాట నిర్వహించ నున్నట్టు చెప్పారు. అసక్తి గలవారు దేవ స్థానం వద్ద నిర్వహించే వేలం పాటలో పాల్గొ నాల్సిందిగా కోరారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీని ఆదర్శంగా మారుస్తాం: కమిషనర్

గజ్వేల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీని ఆదర్శంగా మారుస్తామని మునిసిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య అన్నారు. గజ్వేల్ పట్ట ణంలోని పారిశుధ్య పనులు, నర్సరీ, చెట్లను పరిశీలించారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్ర త్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ టీచర్ల శిక్షణ

మద్దూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రీస్కూల్ నిర్వహణపై అంగన్‌వాడీ టీచర్లకు రిలయన్స్ పౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ ఆదివారంతో ముగిసింది. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూప ర్‌వైజర్ పుష్పలత క్రై ఆర్గనైజేషన్ ప్రాజెక్ట్ మేనేజర్, సుప్రజ, సీఆర్పీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● ధూళిమిట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో రిలయన్స్ ఫౌండేషన్, క్రై ఆర్గనైజన్ అధ్వర్యంలో చిన్నా రుల అభివృద్ధికి సంబంధించి మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు రెండు రోజులు పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూప ర్‌వైజర్ రేణుక అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బ్లాక్ కోఆర్డినేటర్ నవత, సీఆర్పీ నారదాసు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మద్దూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలాఖ్‌పూర్ ఉన్నత పాఠశా లలో శనివారం విద్యార్థులకు సైబర్ నేరాలపై మద్దూరు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ షేక్ మహబూబ్ మాట్లాడారు. సోషల్ మీడియా, సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళల రక్షణకు గల చట్టాలపై వివరించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఈవ్‌టీజింగ్, గంజాయి. ఇతర మత్తు పదార్థాలను ఎలా నివారిం చాలో వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు, షీటీం బృందం పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ప్రచారం

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి) : హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశా లలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు శనివారం పలు జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు ప్రచారం నిర్వహించారు. హుస్నాబాద్, కోహెడ మండలాల్లో కరపత్రా లతో ప్రచారం చేశారు. ప్రచారంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయగిరి భిక్షపతి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని గణేష్‌నగర్‌కు చెందిన ఆకుల ప్రశాంత్ అనారోగ్యంతో బాధపడు తున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లగా సీఎంఆర్ఎఫ్ కింద ఆర్థికసాయాన్ని మంజూరు చేశారు. ఈ మేరకు శనివారం సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో రూ.60వేల చెక్కును కుటుం బీకులకు అందజేసినట్టు తెలిపారు.

● చేర్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం కడవేరుగు గ్రామానికి చెందిన నిరుపేద పొన్న నర్సవ్వ వెన్నుముక సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా కాంగ్రెస్ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ స్పందించి వైద్యఖర్చులకు శనివారం రూ.2.50 లక్షలు విలువగల ఎల్‌వోసీని అందజేశారు.

పాఠశాల భవనానికి మోక్షమెన్నడో?

● ముండ్రాయిలో రూ. 40లక్షల వ్యయంతో ఏడాది క్రితమే పనులు పూర్తి

● అదనపు సౌకర్యాలకు నిధులు మంజూరైనా విడుదల కాని వైనం



ముండ్రాయిలో ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనం

నంగునూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులకు విద్యనందించే లక్ష్యంతో ప్రభుత్వం రూ. లక్షలాదిగా వెచ్చిస్తున్నా, కార్యాచరణకు వచ్చేసరికి పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయి. పనులు పూర్తికాక ఓవైపు.. ఒకవేళ పూర్తయి నప్పటికీ అందుబాటులో రాక మరోవైపు.. కారణాలు ఏవైనప్పటికీ ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. వివరా ల్లోకి వెళ్తే.. నంగునూరు మండలంలోని ముండ్రాయి గ్రామ శివారులో లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన పాఠశాల నూతన భవనం ఏడాదికాలంగా ప్రారంభోత్సవానికి నోచుకోకపోవడం గమనార్హం.

రూ.40 లక్షలతో పనులు

నంగునూరు మండలం ముండ్రాయి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల పురాతన భవనంలో కొనసా గుతుండగా, అది హైవే రోడ్డు పక్కన ఉండడంతో మరోచోటికి మార్చాలని గ్రామస్థులు నిర్ణయించారు. గ్రామస్థుల కోరిక మేరకు గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ ప్రత్యేక నిధుల నుంచి రూ. 40 లక్షలు మంజూరయ్యాయి. దీంతో గ్రామశివారులోని కోనాయి పల్లి రూట్‌లో మహిళా సంఘం పక్కనే నిర్మించేం దుకు నిర్ణయించారు. ఈ మేరకు అన్ని హంగులతో కూడిన ఒక్కో తరగతి గదికి రూ. 10లక్షల చొప్పున వెచ్చించి నాలుగు గదులను నిర్మించారు. నిర్మాణం పనులు పూర్తయినప్పటికీ గత ప్రభుత్వ అధికారులు, నాయకులు ప్రారంభించలేకపోయారు.

అదనపు పనులకు నిధులు విడుదల కాక..

పాఠశాలకు మెరుగైన సౌకర్యాల కల్పన కోసం నిధులు మంజూరైనా విడుదల కాలేదు. ఎన్ఆర్ఈజీ ఎస్ కింద మరుగుదొడ్ల కోసం రూ. 6లక్షలు, వంట గది నిర్మాణం కోసం మరో రూ.3.40లక్షలు మంజూర య్యాయి. అలాగే కాంపౌండ్‌వాల్ కోసం ప్రతిపాదనలు సైతం పంపారు. బిల్లులు రాకపోవడంతో సదరు పను లను నిలిపివేశారు. భవనం పూర్తయినప్పటికీ కాంట్రా క్టర్‌కు సకాలంలో డబ్బులు అందకపోవడం వల్ల భవ నాన్ని అప్పగించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాంట్రాక్ట ర్‌కు నిధులు విడుదల చేయా లని కోరుతున్నారు. దీంతో మిగి లిన కాంపౌండ్ వాల్, మరుగు దొడ్లు, వంటగది నిర్మాణం పూర్తి చేయించి వినియోగంలోకి తీసు కురావాలని గ్రామస్థులు కోరుతు న్నారు.

నిధుల విడుదల కాకపోవడంవల్లే..



గ్రామంలో బడి పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో పంచాయతీరాజ్ ప్రత్యేక నిధుల నుంచి రూ. 40 లక్షలతో పాఠశాల భవన నిర్మాణం చేపట్టారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ. 6లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం, మరో రూ.3.40లక్షలతో వంటగది నిర్మా ణానికి నిధులు మంజూరయ్యాయి. కాంపౌండ్‌వాల్ నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. కానీ భవన నిర్మాణ నిధులు ప్రభుత్వం నుంచి విడుదల కాకపోవడంతోనే మిగతా పనులు చేపట్టలేక పోయాం. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి అసంపూర్తి పనులను వెంటనే పూర్తిచేయించి పాఠ శాలను విద్యార్థులకు అందుబాటులోకి తేవాలి.

- కమలాకర్ రెడ్డి, ముండ్రాయి మాజీ సర్పంచ్

తీన్మార్ మల్లన్నపై పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రెడ్డి సామాజిక వర్గంపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలని రంగధాంపల్లి రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన వ్యాఖ్యలు అభ్యంత రకరమని, ఆయన వెంటనే క్షమాప ణలు చెప్పాలని సంఘం అధ్యక్షుడు వంగ తిరుమల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదిద నాగరాజురెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీగా బాధ్యతాయుత స్థానంలో ఉన్న ఆయన రెడ్డి సామాజిక వర్గాన్ని ఉద్దేశించి, హేళనగా మాట్లా డటం సరైందికాదని, ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్ర మంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు అంకిళ్ల వెంకటేశ్వర రెడ్డి, తడిసిన సుమన్ రెడ్డి, అంకిల్ల వేణుగోపాల్ రెడ్డి, పద్మా రెడ్డి, రాజేందర్ రెడ్డి, పప్పుల కరుణాకర్ రెడ్డి, సత్తిరెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

రెడ్డిల జోలికి వస్తే ఖబడ్దార్..

ఎమ్మెల్సీ స్థాయిలో ఉండి అనుచిత వ్యాఖ్యలు చేయడం తీన్మార్ మల్లన్నకు సరికాదని ఇమాం బాద్ రెడ్డి సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ రెడ్డిలను ఉద్దే శించి తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను వెనక్కి తీసు కోవాలని రెడ్డిల జోలికి వస్తే ఊరుకునేది లేదని అన్నారు. సమావేశంలో రెడ్డి సంఘం అధ్య క్షులు పప్పుల కరుణాకర్ రెడ్డి, ప్రతినిధులు పాతూరి శ్రీనివాస్ రెడ్డి, నాయని నరసింహారెడ్డి, కృష్ణ పల్లి నరసింహారెడ్డి, పప్పుల రాజిరెడ్డి, గూడ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన గట్ల మల్యాల విద్యార్థులు



ఎంపికైన ఈశ్వరి, అను

నంగునూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్ర జ్యోతి): గత నెల మెదక్ జిల్లా తూప్రాన్‌లో జరిగిన 68వ ఎస్‌జీఎఫ్ఐ అండర్ 14 విభాగం సాఫ్ట్‌బాల్ పోటీల్లో గట్ల మల్యాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠ శాల హెచ్ఎం రమేష్ తెలిపారు. జడ్పీహెచ్ఎస్ గట్లమాల్యాల కు చెందిన విద్యార్థినులు బి. ఈశ్వరి (8వ తరగతి), డి.అను(9వ తరగతి) జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు వెల్లడించారు. ఈ నెల 13 నుంచి 16 వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజకుమార్ ను పాఠశాల ఉపాధ్యా యులు తదితరులు అభినందించారు.

దుబ్బాక మున్సిపల్ అవినీతిపై ఫిర్యాదు చేస్తా

దుబ్బాక, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీలో గత ఐదేళ్లలో జరిగిన అవినీతిపై కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ (పౌర మానవ హక్కుల సంస్థ) ఫిర్యాదు చేయనున్నట్టు ఆ సంస్థ కన్వీనర్ గుండ్ల శివచంద్ర తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ.. చట్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తమ సంస్థ పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగా సమాచార హక్కుచ ట్టంతో దుబ్బాక మున్సిపల్‌లో గత ఐదేళ్ల జరిగిన పనుల వివరా లను సేకరించామన్నారు. ఈ పనుల్లో అవినీతి చోటుచేసుకుందని, వాటిపై తాము అంచెలవారిగా ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. రెండురోజులుగా తాము సేకరించిన వివరాల్లో చాలా విషయాలు వెలుగు చూశాయన్నారు. రెండు రోజుల్లో తేదీలవారీగా నివేదికను సీఎం కార్యాలయం, రాష్ట్ర పురపాలిక శాఖ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆయన వెంట సంస్థ ప్రతినిధులు చరణ్‌కాంత్, కరీ మోద్దీన్, ఆశోక్, రత్నాకర్, తదితరులున్నారు.

పీఈటీ అశోక్‌సార్‌కు కొవ్వొత్తులతో నివాళి



కొమురవెల్లిలో కొవ్వత్తులతో ప్రదర్శన

చేర్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : కొము రవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామానికి చెందిన పీఈటీ అశోక్ ఇటీవల గుండెపోటుతో మరణించడం పట్ల సంతాపం వ్యక్తంచేస్తూ కొమురవెల్లి గ్రామానికి చెందిన యువకులు శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శ నతో ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా గ్రామంలోని జడ్పీ ఎస్ఎస్ నుంచి మల్లన్న ఆలయ పరి సరాల మీదుగా పోలీస్‌బొమ్మ వరకు అశోక్‌సార్ అమర్ రహే అని నినా దాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనం తరం రెండు నిమిషాలపాటు మౌనం పాటించి నివాళులర్పించారు. ఆట, పాట, మాటముచ్చట, సత్ప్రవర్తనతో విద్యార్థుల మదిలో గూడుకట్టుకున్న అశోక్‌సార్‌ను కొము రవెల్లి యువత, విద్యార్థులు మర్చిపోలేరని పేర్కొన్నారు.

గ్రామాల్లో స్థానిక ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధం



గ్రామస్థులతో మాట్లాడుతున్న పూజల హరికృష్ణ

సిద్దిపేట రూరల్,ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో పోటీ చేయనున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దీమా వ్యక్తం చేశారు. శనివారం సిద్ది పేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో బీరప్ప ఆలయానికి రూ.5 లక్షలు, గౌడ సంఘం ప్రహరీకి రూ.5 లక్షల నిధులతో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనం తరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుంచి నేటి వరకు సిద్దిపేట రూరల్ మండలానికి రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సొంత మండలం అయినప్పటికీ నేటికీ మండలం అభివృద్ధి చెందలేదన్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సౌకర్యాలను కల్పిస్తూ ప్రజలకు ఎంతో దగ్గరయ్యామన్నారు. త్వరలో మరింత అభివృద్ధి పనులు చేపట్టి కేసీఆర్ సొంత మండలం నుంచే గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల ఏకగ్రీవా లతో రికార్డు సృష్టిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సదాశివరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బుచ్చిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మంద పాండు, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ, నాయకులు దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

మున్నూరు కాపులను తక్కువ చేసి చూపడం సరికాదు

సిద్దిపేట కలెక్టరేట్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కుల గణనలో మున్నూరుకాపులను తక్కువ సంఖ్యలో చూపించి సీఎం రేవంత్‌రె డ్డి తమను మోసం చేశారని మున్నూరుకాపు సంఘం రాష్ట్ర అధ్య క్షుడు దేవయ్య ఆరోపించారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. కుల గణన ద్వారా బీసీలు 42 శాతం ఉన్నారని అందులో మున్నూరు కాపులు 8 శాతం మాత్రమే అనడం పూర్తిగా అవాస్తవమన్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం చేప ట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో అప్పటి ప్రభుత్వం మున్నూరు కాపులు 18 శాతం ఉన్నారని ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటి కైనా సర్వే మళ్లీ నిర్వహించి ప్రభుత్వం కులాల లెక్కలను సరిగా ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్నూరు కాపులంతా ఏకమై పోరాటం చేస్తామని ఆయన హెచ్చ రించారు. సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులు హరిశంకర్, పూర్ణ చంద్ర శేఖర్, సతీష్ కుమార్, శ్రీనివాస్, మురళి, బాలయ్య పాల్గొన్నారు.

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌ను గెలుచుకుంటాం

● డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిప ల్‌పై కాంగ్రెస్ జెండా ఎగురవేసి సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని 1, 2 వార్డులలో కాంగ్రెస్ పార్టీ జెండా పండుగ నిర్వహించిన సందర్భంగా నర్సారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ పరిధి లోని 2వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ పటిష్టంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలను చైతన్యం చేయాలని స్పష్టం చేశారు. త్వరలోనే గజ్వేల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2వ వార్డు అధ్యక్షుడిగా మల్లారెడ్డి, అదే వార్డు కాంగ్రెస్ అభ్యర్థిగా కప్ప మహేష్‌ను ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంక్షారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేం దర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్, మాజీ కౌన్సిలర్లు షహనాజ్ సమీర్, సుభాష్ చంద్ర బోస్, రాంచంద్రాచారి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

19న సిద్దిపేటలో భారీ బైక్ ర్యాలీ

● సిద్దిపేట జిల్లా హిందూ వాహిని అధ్యక్షుడు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19వ తేదీన సాయంత్రం ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా సిద్దిపేటలోని రేణుక ఎల్లమ్మ గుడి నుంచి సిద్దిపేట పురవీధుల గుండా శివాజీ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీ ఉంటుందని హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు బస్వరాజు సత్యం తెలిపారు. శనివారం సిద్దిపేట శివాజీ విగ్రహం వద్ద ఆయన హిందూ వాహిని కార్యకర్తలతో కలిసి కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. ర్యాలీ అనంతరం శివాజీ చౌక్ వద్ద భారీ బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. అయితే కొందరు సోషల్ మీడియాలో ర్యాలీ ఉదయం 11గంటలకు ఉంటుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఇలాంటి కుట్రలను నమ్మవద్దని తెలిపారు. సాయంత్రం నాలుగు గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని అనంతరం ఆరు గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. ఉదయం 11 గంటలకే ర్యాలీ అని సోషల్ మీడియాలో పోస్ట్ చేసినవారికి హిందూవాహినితో ఎలాంటి సంబంధం లేదని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):సిద్ది పేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులో మయూక అపార్ట్‌మెంట్ వెనుక గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకున్నది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎండీ అమీర్‌ఖాన్ వ్యవ సాయ పొలం వద్ద గల చింత చెట్టుకు ఉరేసుకుని వేలాడుతున్న వ్యక్తి మృతదేహం కనిపించడంతో అతడు పోలీసులకు సమాచారమందించాడు. పోలీ సులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించగా ఎలాంటి ఆన వాళ్లు లభించలేదు. కాగా మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో భద్రపరిచి నట్లు తెలిపారు. మృతుడి వయస్సు 38ఏళ్ల లోపు ఉంటుందని, నలుపు రంగు ప్యాంట్, డ్రాయర్ ధరించి, ఎడమ చెయ్యిపై ఇంగ్లిషులో తనూజ అనే పచ్చ బొట్టు ఉందని పోలీసులు తెలిపారు. ఎవరికైనా తెలిసినవారుంటూ సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. భూమి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీను

నంగునూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పట్టుబడిన ఆరు గురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. మండలం రాంపూర్ క్రాస్ రోడ్ వద్ద గల బస్టాండ్ వెనకాల ఖాళీ స్థలంలో గంజాయి విక్రయిస్తున్నట్టు పోలీసు లకు సమాచారమందింది. ఈ మేరకు రాజగోపాలపేట ఎస్ఐ ఆసిఫ్ తమ సిబ్బందితో వెళ్లి దాడి చేయగా ఆరుగురు వ్యక్తులు గంజాయి పడేసి పారిపో యేందుకు యత్నించారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకొని విచారిం చగా గంజాయి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నారు. వారిలోని ఇద్దరు వ్యక్తులు మండలంలోని అప్పలాయచెరువు గ్రామానికి చెందిన నాయిని రాజశేఖర్ రెడ్డి, జేపీ తండాకు చెందిన గుగులోతు ప్రవీణ్. గత కొద్ది కాలంగా అసిఫాబాద్ జిల్లా కెరిమేరి మండలానికి చెందిన రవి అలియాస్ జాదవ్ సందీప్ దగ్గర కిలో రూ. 10వేల చొప్పున రెండు కిలోలకు రూ 20 వేలు ఇచ్చి కొనుగోలు చేసి చిన్న చిన్న ప్యాకెట్లు చేసి ఒక్కో ప్యాకెట్ రూ 900 చొప్పున విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అలాగే గంజాయి కొనుగోలు చేసిన సిద్దిపేట మున్సి పాలిటీ పరిధిలోని రంగధాంపల్లికి చెందిన రొంపల్లి నరేశ్(32), అప్పలాయ చెరువుకు చెందిన నాయిని రాంరెడ్డి (28), బద్దిపడగ గ్రామానికి చెందిన అల కుంట్ల రాకేశ్ (20), గూగులోతు రాజకుమార్ (25) ల పై కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి 508గ్రాముల గంజాయిని, రెండు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్ ఫోన్లు, రూ.3,600నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బైరాన్‌పల్లిలో వివాహిత అదృశ్యం

మద్దూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో వివాహిత అదృశ్యమైంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన పుప్పాల కనకరాజుకు 2019లో మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన సింధుప్రియతో వివాహం జరిగింది. వీరికి బాబు, పాప జన్మించారు. ఈ నెల 7న రాత్రి భోజనం చేసి పడుకున్నారు. రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో బాబు ఏడుస్తుండగా నిద్ర లేచి చూసేసరికి భార్య సింధుప్రియ కన్పించలేదు. చుట్టుపక్కల భర్త కనకరాజు గాలించినా ఫలితం లేకపోయింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బెదిరించిన విలేకరిపై కేసు

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మట్టి దందా చేస్తున్నారంటూ రైతు లను బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసిన విలేకరిపై జగదేవ్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఇటిక్యాల గ్రామానికి చెందిన దళితులకు కొన్నేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం భూమిని పంపిణీ చేసింది. ఆ భూమిలో రాళ్లు ఉండటంతో ఇన్నాళ్లు సాగు చేపట్టలేదు. తాజాగా ప్రభుత్వం సాగు భూములకే రైతు భరోసా ఇస్తామని చెప్పడంతో ఆ భూముల్లో సాగు చేయాలని రైతులు యాదగిరి, ఎల్లయ్య, నర్సింలుతో పాటు మరికొంత మంది రైతులు ఎక్సకవేటర్‌తో భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న నర్రా రాంచంద్రంతో పాటు మరికొందరు గ్రామానికి చేరుకుని భూమి చదును చేస్తున్న ఫొటోలు తీసుకున్నారు. ఎక్సకవేటర్ నిర్వాహ కుడు కుమార్‌కు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని, లేకుంటే మట్టి దందా చేస్తున్నా రంటూ వార్త రాస్తామని బెదిరించారు. డబ్బులు ఇవ్వకపోవడంతో నర్రా రామ చంద్రం వాట్సాప్ గ్రూపుల్లో అసైన్డ్ భూముల్లో, దేవాదాయ భూముల్లో మట్టి దందా అంటూ వార్తను పోస్ట్ చేశాడు. దీంతో రైతులు తమపై తప్పుడు వార్తలు రాసి, డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా లాల్ బహదూర్ గౌడ్





నూతనంగా ఎన్నికైన గీత పారిశ్రామిక సహకార సంఘం కమిటీ సభ్యులు, (ఇన్‌సెట్‌లో)లాల్ బహదూర్ గౌడ్

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట గీత పారిశ్రామిక సహ కార సంఘం అధ్యక్షుడిగా పల్లె లాల్ బహదూర్ గౌడ్ ఎన్నికైనట్లు సహకార సంఘం ఎన్నికల కమిటీ శనివారం ప్రకటించింది. ఈ మేరకు నూతన కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా మార్క శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శిగా పల్లె బాలకి షన్ గౌడ్, కోశాధికారిగా గాదగోని కిష్టయ్య గౌడ్, డైరెక్టర్లుగా బాలగొని బుచ్చవ్వ గాదగోని సత్యం గౌడ్, పల్లె జ్యోతి పల్లె సునీల్ గౌడ్, గాదగోని ప్రకాష్‌గౌడ్ ఎన్నికైనట్టు ప్రకటించారు.

నేటి నుంచి కేసీఆర్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని సిద్దిపేట అర్బన్ మండలంలో మండల నాయ కులు, కేసీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 17వ తేదీ వరకు కేసీ ఆర్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎద్దు యాదగిరి, పయ్యావుల శ్యామ్, చింతల శ్రీనివాసులు తెలిపారు. శనివారం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సిద్దిపేట అర్బన్ మండల వ్యాప్తంగా 12 గ్రామాల నుంచి 30 టీములు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నా న్నారు. సమావేశంలో నాయకులు రాము, సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మహిళలు రుణాలు తీసుకొని అభివృద్ధి చెందాలి

ములుగు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ములుగు ఏపీఎం యాదగిరి కోరారు. శనివారం మండలంలోని నర్సాపూర్ గ్రామంలో మహిళా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం యాద గిరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలను బ్యాంకుల ద్వారా అందిస్తుందన్నారు. ఇప్పటికే మండలంలోని 455 గ్రూపులకు 25 కోట్లకు పైగా రుణాలు అందించినట్టు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

మద్దూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మేక సంతోష్ సూచించారు. శనివారం మండలంలోని సలాఖ్‌పూర్, ధర్మారం గ్రామాల్లో నిర్వ హించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ వ్యతి రేక విధానాలను ఎండగడుతూ ముందుకెళ్లాలని సూచించారు.

ఢిల్లీలో విజయం.. జిల్లాలో సంబురం







హుస్నాబాద్, చేర్యాల, దుబ్బాక మండలకేంద్రాల్లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

న్యూస్‌నెట్‌వర్క్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం సాధించిన సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుతూ సంబురాలను ఘనంగా జరుపుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన ప్రతీ నాయకుడిని ఓడించే సత్తా ప్రజలకు మాత్రమే ఉందని మరోసారి ఢిల్లీ ప్రజలు రుజువు చేశారన్నారు. సిద్దిపేట పట్ట ణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సిద్దిపేట బిజెపి పట్టణ అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంచి పెట్టుకున్నారు. దుబ్బాకలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండ్ వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచారు. చేర్యా లలో అంగడిబజారు చౌరస్తా వద్ద బీజేపీ నాయ కులు బాణసంచా కాల్చి విజయోత్సవ సంబు రాలు నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో బాణ సంచా కాల్చి, మిఠాయి పంచుకొని సంబురాలు చేసుకున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబే డ్కర్ చౌరస్తాలో ఆ పార్టీ నాయ కులు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు రాలు లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తదితరులు బాణా సంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే తొగుట, దౌల్తాబాద్, కుకునూరుపల్లి, రాయపోల్ మండలాల్లో ఆయా మండలాల బీజేపీ నాయ కులు విజయోత్సవ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు.



సిద్దిపేటలో స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు